సాక్షి ఖమ్మం

శనివారం । 23 । డిసెంబర్ । 2023



దేశీయ వంగడాలతోనే మేలు

దేశీయ వంగడాలు, సేంద్రియ విధానంలో పంటల సాగుతో అనేక లాభాలు ఉన్నాయని పలువురు రైతులు చెబుతున్నారు. 8లో



కదం తొక్కిన యువ'జనం'

జిల్లా స్థాయి యువజనోత్సవాలు ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహించగా ప్రదర్శనలతో కళాకారులు హోరెత్తించారు. 8లో

గరిష్టం / కనిష్టం

28° / 17°

వాతావరణం

జిల్లాలో శనివారం కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రోజంతా చలిగాలుల ప్రభావం ఉండి, సాయంత్రం తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

చినజీయర్ స్వామిని కలిసిన మంత్రి తుమ్మల



స్వామి నుంచి డైరీ అందుకుంటున్న మంత్రి

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర వ్యవసాయ, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం చినజీయర్ స్వామిని కలిశారు. హైదరాబాద్ సమీపంలోని ఆశ్రమంలో కలిసిన మంత్రి స్వామి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మలను చినజీయర్ స్వామి శాలువాతో సత్కరించి నూతన సంవత్సర డైరీ అందజేశారు.

నేడు జిల్లాకు మంత్రి పొంగులేటి

ఖమ్మంవన్‌టౌన్/కూసుమంచి: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరనున్న ఆయన హుజూర్‌నగర్‌లో మరో మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి గృహనిర్మాణ శాఖపై జరిగే సమీక్షలో పాల్గొంటారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 3.45 కూసుమంచికి చేరుకోనున్న మంత్రి పొంగులేటి.. క్రిస్మస్ కిట్లు, షాదీముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఆతర్వాత ఖమ్మంలో నివాసానికి చేరుకుని, ఆదివారం ఉదయం హైదరాబాద్ బయలుదేరతారని క్యాంపు కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి తెలిపారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి బాలికల క్రికెట్ పోటీలు

అశ్వాపురం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల కేంద్రంలోని గౌతమీనగర్ కాలనీలో అండర్-17 బాలికల రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు శనివారం నుంచి జరగనున్నాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన నిర్వహించే ఈ పోటీలకు ఉమ్మడి పది జిల్లాల వారీగా జట్లు పాల్గొంటాయి. శనివారం ఉదయం 10.30 గంటలకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పోటీలను ప్రారంభించనుండగా, 26వ తేదీ వరకు కొనసాగుతాయి.

సమష్టి కృషితోనే లాభాలు

సత్తుపల్లి డిపోకు రూ.2.50 లక్షల క్యాష్ రివార్డ్



ఉద్యోగులకు బహుమతులు అందస్తున్న డీఎం రాజ్యలక్ష్మి

సత్తుపల్లిటౌన్: అధికారులు, ఉద్యోగులు సమష్టిగా, అంకితభావంతో పని చేయడంతోనే వల్లే సత్తుపల్లి ఆర్టీసీ డిపో లాభాలు గడించి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిందని డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి తెలిపారు. డిపోలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర స్థాయి బీ-క్లాస్ బెస్ట్ బస్టాండ్ అవార్డుతో పాటు రాష్ట్ర స్థాయిలో డిపో రెండో స్థానం దక్కించుకుందని తెలిపారు. ఈసందర్భంగా రూ.2.50 లక్షల నగదు బహుమతి ప్రకటించగా, ఈ నగదుతో డిపోలోని 360 మంది ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. అసిస్టెంట్ మేనేజర్ విజయశ్రీ, ఉద్యోగులు బాలస్వామి, టి.సుబ్బారావు పాల్గొన్నారు.

కనులారా వీక్షించి..



పవిత్ర గోదావరిలో హంసవాహనంపై విహరిస్తున్న శ్రీసీతారామ చంద్రస్వామివారు



పూజలు అందుకుంటున్న రామయ్య స్వామి

ఆనందపరవశులైన భక్తజనులు

- కమనీయంగా శ్రీ సీతారామచంద్ర స్వామి వారి తెప్పోత్సవం
- మిరిమిట్లు గొలిపే కాంతులతో మనోహరంగా గోదావరి తీరం
- భక్తుల రద్దీతో సందడిగా మారిన భద్రగిరి క్షేత్రం

భద్రాచలం: పండితుల వేదమంత్రోచ్చరణలు, భక్తజనుల జయజయ ధ్వానాల నడుమ సీతాలక్ష్మణ సమేతుడైన రామయ్య స్వామి లాహిరి లాహిరి.. లాహిరి అనుకుంటూ గోదావరిలో జలవిహారం చేశారు. విద్యుత్ దీపకాంతులు, బాణసంచా వెలుగుల నడుమ శ్రీసీతారామచంద్రస్వామి విహరిస్తుండగా, వీక్షించిన భక్తులు ఆనంద పరవశులయ్యారు. తెప్పోత్సవ దృశ్యాలను మది నిండా దాచుకుని తిరిగి ఉత్తర ద్వార దర్శనంలో మరోసారి రాముడి దర్శనం కోసం భద్రాద్రిలో ఎదురు చూస్తున్నారు.

ఊరేగింపుగా నదీ తీరానికి..

పగల్‌పత్తు ఉత్సవాలలో భాగంగా శుక్రవారం ఉత్సవ మూర్తులకు విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం, సేవాకాలం, శ్రీ తిరుమంగై అళ్వార్లకు పరమపదోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం రాజభోగం, శాత్తుమురై, పూర్ణ శరణాగతితో పగల్‌పత్తు ఉత్సవాలకు ముగింపు పలికారు. గర్భగుడిలో ప్రభుత్వోత్సవం (దర్బార్ సేవ) నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాలు, భక్తుల జయజయధ్వానాల నడుమ సాయంత్రం నాలుగు గంటలకు ప్రత్యేక పల్లకీపై సీతారాములు గోదావరి తీరానికి బయల్దేరారు. భక్తుల కోలాటాలు, వివిధ వేషధారణల నడుమ స్వామివారిని తీసుకొచ్చారు. అర్చకులు తొలుత పుణ్య జలాలతో హంసవాహనాన్ని సంప్రోక్షణ చేశారు. ఊరేగింపుగా వచ్చిన స్వామివారిని హంసవాహనంలో ప్రత్యేక అలంకరణ మండపంలో తూర్పు ముఖంగా కొలువుదీర్చారు. ఈ సందర్భంగా వేదపండితులు చతుర్వేదాలు, నాళాయర దివ్యప్రబంధం, పంచసూత్రాలు, స్తోత్ర పాఠాలు పఠించారు. అనంతరం మంగళహారతి, చక్రపొంగలి నివేదనతో సుమారు గంట పాటు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చివరగా హారతి ఇచ్చి వీఐపీలను దర్శనానికి అనుమతి ఇచ్చారు.

ఉత్తర ముఖంగా..

ఆగమ శాస్త్ర పూజాధికాలు పూర్తయిన తర్వాత సాయంత్రం 6 గంటల సమయంలో ఉత్తర ముఖంగా గోదావరి నదిలో హంస వాహనం కదిలింది. నిశ్చలంగా ఉన్న గోదావరి నదిలో విద్యుత్ దీప కాంతులతో ధగధగ మెరుస్తున్న హంస వాహనం, అందులో ఆశీనులైన సీతారాములను చూసేందుకు భక్తులు పోటీ పడ్డారు. తెప్పోత్సవం మొదలైన వెంటనే నదికి ఆవలి తీరంలో బాణసంచా కాల్చడం మొదలైంది. నదిలో హంస వాహన ప్రతిబింబం, ఆకాశంలో బాణసంచాలు వెలువరిస్తున్న రంగురంగుల మెరుపుల మధ్య గోదావరి తీరం ప్రత్యేక శోభను సంతరించుకోగా, రామయ్య జలవిహారం కనుల పండువగా సాగింది. ఒక్కో పరిక్రమాణానికి సగటున 12 నిమిషాల సమయం పట్టింది. మొత్తంగా ఐదు పరిక్రమణాలు పూర్తయ్యే సరికి రాత్రి 7.01 గంటలయింది. తెప్పోత్సవం ముగిసిన అనంతరం ఆగమ శాస్త్ర పద్ధతులు అనుసరిస్తూ సీతారాములను తిరిగి ఆలయానికి తీసుకువచ్చారు.



తెప్పోత్సవాన్ని వీక్షిస్తున్న కలెక్టర్ ప్రియాంక, ఐటీడీఏ పీఓ ప్రతీక్, ఏఎస్పీ తదితరులు

ఆకట్టుకున్న కోలాటం

ఆలయంలో ప్రత్యేక పూజలు అందుకున్న స్వామివారు సాయంత్రం 4గంటలకు ప్రత్యేక పల్లకీపై ఊరేగింపుగా గోదావరి తీరానికి బయలు దేరారు. తెప్పోత్సవానికి పల్లకీలో స్వామివారు వెళ్లే సమయంలో పల్లకీ ముందు వివిధ సంస్థల ఆధ్వర్యంలో మహిళలు చేసిన కోలాట ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పురుషోత్తపల్లి మహిళల డప్పు నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ముక్కోటి దేవతలు పూజించే క్షణం

నేడు సీతారాముల ఉత్తర ద్వార దర్శనం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: వైకుంఠంలో వైకుంఠ ఏకాదశి రోజు స్వామి వారిని ముక్కోటి దేవతలు దర్శించుకుంటారని ప్రతీతి. ఇదేరోజు స్వామిని దర్శించుకుంటే ముక్కోటి దేవతలను దర్శించుకున్నంత పుణ్యఫలం వస్తుందని, సర్వపాపాలు తొలగి వైకుంఠప్రాప్తి కలుగుతుందని భక్తులు విశ్వసిస్తారు. అందువల్లే ఏకాదశి రోజున భద్రాచలంలో ఉత్తరద్వారం నుంచి రామయ్యను దర్శించుకునేందుకు ఇష్టపడతారు.

బ్రహ్మముహూర్తంలో..

భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనం ఇవ్వడానికి ముందు తెల్లవారుజామున మూడు గంటల నుంచే పూజాధికాలు మొదలవుతాయి. సుప్రభాత సేవలు, విశేష అభిషేకాలు నిర్వహిస్తారు. దేవస్థాన హరిదాసులు శ్రీరామ కీర్తనలు పాడాక, రామయ్య, సీత, లక్ష్మణ వాహనాల ప్రత్యేకతలను తెలియజేస్తారు.

భక్తి భావన..

ఉదయం ఐదు గంటల సమయంలో ఉత్తర ద్వారాలు తెరచుకోగానే దట్టంగా కమ్ముకున్న ధూపం భక్తులకు కనిపిస్తుంది. ధూపాన్ని చీల్చుకుంటూ దీపాల కిరణాలు కనిపిస్తాయి. ఈ రెండింటి నడుమ జగదభిరాముడు గరుడవాహనంపై, సీతమ్మవారు గజవాహనంపై, లక్ష్మణస్వామి హనుమత్ వాహనంపై ఆశీనులై భక్తులకు దర్శనమిస్తారు. దీంతో భక్తులు ఒక్కసారిగా జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తారు. మేళతాళాల నడుమ పండితులు మంగళహారతులు ఇస్తుంటారు.

ధూపదీపాల నడుమ..

గంటసేపు ఉత్తర ద్వారంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం 108 ఒత్తులతో కూడిన హారతిని స్వామివారికి ఇచ్చాక, ద్వార దర్శనం ప్రాశస్త్యాన్ని వివరిస్తారు. అక్కడి నుంచి తిరువీధి సేవకు తీసుకెళ్తారు. ఆలయం నుంచి రాజవీధి మీదుగా తాతగుడి వరకూ వెళ్తారు. తొలుత ఆండాళ్, ఆళ్వార్ దేవతలు.. వందలాది మంది భక్తులు స్వామి వెంట నడుస్తుండగా గోవిందరాజస్వామి ఆలయం వరకు తీసుకెళ్తారు. అక్కడ ప్రత్యేక పూజల అనంతరం ఆలయానికి సీతారాములను తీసుకొస్తారు.

రూ.కోటిన్నర హాంఫట్

సత్తుపల్లిలోని ఓ ప్రైవేట్ బ్యాంకు ఉద్యోగుల చేతివాటం

- విధులకు ఇద్దరు ఉద్యోగుల గైర్హాజరు
- క్రికెట్ బెట్టింగ్‌తో పాటు జల్సాలకు డబ్బు వెచ్చించినట్లు ప్రచారం
- పలువురు వినియోగదారులకు సెటిల్‌మెంట్?



నమ్మకమే పెట్టుబడిగా, పరిచయమే ఆలంబనగా ఇద్దరు బ్యాంకు ఉద్యోగులు స్వాహా పర్వానికి తెరతీశారు. సత్తుపల్లి బస్టాండ్ సెంటర్ సమీపాన ఉన్న ప్రైవేట్ బ్యాంకుకు చెందిన వీరు ఖాతాదారులను నమ్మించి రూ.కోటిన్నర మేర సొంత అవసరాలకు వాడేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఒకరి నుంచి ఇంకొకరికి ప్రచారం జరుగుతూ విషయం బయటకు రావడంతో బాధితులు మరింత మంది బయటకు వస్తున్నారు. నెల రోజుల నుంచి బ్యాంకులో లోపాయికారిగా బాధితులకు నగదు సర్దుబాటు చేసేలా జరిపిన యత్నాలు బెడిసికొట్టగా, ఇప్పటికే విధులకు గైర్హాజరవుతున్న ఉద్యోగులిద్దరిని సస్పెండ్ చేసిన బ్యాంకు ఉన్నతాధికారులు తదుపరి చర్యలపై దృష్టి సారించినట్లు తెలిసింది.

– సత్తుపల్లి

సార్ డిపాజిట్ చేయండి

సాధారణంగా ప్రైవేట్ బ్యాంకుల్లో ఉద్యోగులకు లక్ష్యాలు ఉంటాయి. దీంతో సదరు బ్యాంకులోని ఓ ఉద్యోగి తన వాక్చాతుర్యంతో వినియోగదారులను ఆకట్టుకుని స్వాహా పర్వానికి తెరలేపినట్టు తెలిసింది. అకౌంట్‌లో డిపాజిట్ చేస్తే వడ్డీ రావడమే కాక, బ్యాంక్‌లో మంచి గుర్తింపు ఉంటుందని పలువురిని నమ్మబలికి డిపాజిట్లు సేకరించారు. కాగా, సదరు ఉద్యోగిపై నమ్మకంతో కొందరు డిపాజిట్ చేయాలని చెక్కులు ఇవ్వగా, వారి అకౌంట్లలో కాక బ్యాంక్‌లోనే పనిచేస్తున్న ఇంకో ఉద్యోగి భార్య అకౌంట్‌లోకి మళ్లించినట్లు సమాచారం. అయితే, అకౌంట్లలో డబ్బు జమ కాకపోవడంపై పలువురు ప్రశ్నించగా సర్వర్ సమస్య కారణంగా జాప్యం జరుగుతోంది, ఏమీ కాదంటూ నమ్మించడంతో పట్టించుకోలేదని తెలిసింది.

ఓడీ, సాధారణ అకౌంట్లలోనూ..

బ్యాంకుల్లో ఎవరైనా రుణాలు తీసుకుంటే ఓడీ అకౌంట్‌లో నగదు జమ అవుతుంది. ఆ నగదు విత్‌డ్రా చేయకపోతే వడ్డీ భారం పడదు. కొందరు అవసరమైనంత మేర నగదు తీసుకుని మిగతా డబ్బు ఓడీ అకౌంట్‌లోనే ఉంచుతారు. ఈక్రమంలోనే ఒక వినియోగదారుడు రూ.10లక్షల నగదు కోసం చెక్ ఇవ్వగా చేతివాటం ప్రదర్శించినట్టు సమాచారం. దీనిపై పలుమార్లు బ్యాంకుకు వెళ్లి సదరు ఉద్యోగిని నిలదీయగా త్వరలోనే జమ చేస్తానని చెబుతూ వాయిదా వేస్తుండడంతో ఈనెల 4న బ్యాంకు ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. మరొకరి జనరల్ అకౌంట్ నుంచి కూడా రూ.2 లక్షలు తీసుకున్నట్టు సమాచారం.

క్రికెట్ బెట్టింగ్

క్రికెట్ టోర్నీల సందర్భంగా బెట్టింగ్ కాసేందుకే సదరు ఉద్యోగి కస్టమర్ల జేబులకు చిల్లులు పెట్టినట్టు తెలిసింది. రూ.లక్షల రూపాయాలు పందాలు కాయడం, అర్ధరాత్రి వరకు పార్టీలు చేసుకుంటూ డబ్బులుల విచ్చలవిడిగా ఖర్చు చేస్తుండగా ఈ వ్యవహారం వెలుగు చూసింది. కాగా, తొలినాళ్లలో అధికారులు పట్టించుకోకపోవడంతో ఏకంగా సదరు ఉద్యోగి వినియోగదారుల డబ్బుతో జూదం ఆడినట్టు తెలిసింది.

మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ ఒక్కరే..

సత్తుపల్లిలోని సదరు బ్యాంక్ మేనేజర్ సెలవుపై వెళ్లడంతో అసిస్టెంట్ బ్యాంకు మేనేజర్ విధులు నిర్వర్తిస్తున్నారు. చెక్కులను పాస్ చేయాల్సిన బ్యాంక్ మేనేజర్ బాధ్యతలను అసిస్టెంట్ మేనేజర్ నిర్వర్తిస్తుండడంతో డబ్బు సులువుగా దారి మళ్లించినట్లుతెలుస్తోంది. ఈ తతంగమంతా నెల రోజుల్లోనే జరగగా.. రూ.కోటిన్నర మేర నిధులు పక్కదారి పట్టడంతో వినియోగదారులు లబోదిబోమంటున్నారు.

కొంత మందికి చెల్లింపు

బ్యాంకులో డబ్బు స్వాహా అయ్యాయని వినియోగదారుల వాగ్వాదానికి దిగుతుండడంతో సదరు ఉద్యోగులిద్దరూ విధులకు హాజరు కావటం మానేశారు. దీంతో మరింత కంగారుపడిన కస్టమర్లు మిగిలిన సిబ్బందిని నిలదీయడంతో వారిద్దరిని పిలిపించి గుట్టుచప్పుడు కాకుండా కొందరికి సుమారు రూ.46 లక్షల మేర ఇప్పించినట్లు సమాచారం. మిగిలిన రూ.1.04 కోట్లకు పైగా నగదు రావాల్సిన కస్టమర్లు బ్యాంకు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇంతలోనే సదరు ఉద్యోగులిద్దరిని సస్పెండ్ చేసిన ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. అదేసమయాన అధికారులు పలుమార్లు వినియోగదారులతో చర్చించి బ్యాంకుపై నమ్మకం దెబ్బతినకుండా చర్యలు చేపట్టారు. నగదు రికవరీ ఆలస్యమవుతుండడంతో వారికి లెటర్లు ఇచ్చినట్టు తెలిసింది.

మాకు చెప్పే అధికారం లేదు

బ్యాంకు ఉద్యోగులిద్దరు వినియోగదారులకు చెందిన రూ.1.50 కోట్లు స్వాహా చేశారనే అంశంపై వివరణ కోరేందుకు బ్యాంకు మేనేజర్‌ను సంప్రదించగా వివరణ కానీ సమాచారం కానీ చెప్పే అధికారం తనకు లేదని పేర్కొన్నారు. కానీ బ్యాంకులో అక్రమాలు జరిగినట్టు తన దృష్టికి రాలేదంటూ దాటవేసే ప్రయత్నం చేయడం గమనార్హం. జమ చేసిన ప్రతీ పైసాకు బ్యాంకు జవాబుదారీగా ఉంటుందని, పొరపాట్లు జరిగితే ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు. కాగా, ఘటనపై బ్యాంక్ తరపున సత్తుపల్లి పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని వెల్లడించారు.

సకాలంలో వివరాలు సమర్పించండి

ఎన్నికల నోడల్ అధికారి విజయకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న విజయకుమారి

ఖమ్మం సహకారనగర్: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులు వ్యయ రిజిస్టర్లను ఫలితాలు వెల్లడైన 30 రోజుల్లోగా సమర్పించాల్సి ఉంటుందని జిల్లా సహకార అధికారి, అసెంబ్లీ ఎన్నికల జిల్లా వ్యయ నోడల్ అధికారి విజయకుమారి సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల ప్రతినిధులతో శుక్రవారం ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విజయకుమారి మాట్లాడుతూ పోటీ చేసిన ప్రతీ అభ్యర్థి ఎన్నికల వ్యయ వివరాలను నిబంధనల మేరకు పూర్తి సమాచారం, సంతకాలతో జనవరి 2లోగా సమర్పించాలని తెలిపారు. కాగా, ఈనెల 29న ఎన్నికల పరిశీకుల సమక్షాన జరిగే సమావేశానికి అభ్యర్థుల ప్రతినిధులు హాజరుకావాలని చెప్పారు. ఈసమావేశంలో జిల్లా ఆడిట్ ఉప సంచాలకులు హుస్సేన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

260 మంది డాక్ సేవక్‌ల తొలగింపు

నిరవధిక సమ్మెలో పాల్గొనడంతో వేటు



నేలకొండపల్లిలో సమ్మె చేస్తున్న డాక్ సేవక్‌లు (ఫైల్)

ఖమ్మం గాంధీచౌక్/నేలకొండపల్లి/సత్తుపల్లి టౌన్: సమస్యలు పరిష్కరించాలని సమ్మెకు దిగిన గ్రామీణ డాక్ సేవక్ (జీడీఎస్)లపై కేంద్ర ప్రభుత్వం వేటు వేసింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా(ఖమ్మం డివిజన్)లో 1,500 మందికి పైగా డాక్ సేవక్‌లు విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు దేశవ్యాప్త సమ్మెలో భాగంగా 550 మంది పాల్గొన్నారు. అయితే, నిబంధనలు ఉల్లంఘించి సమ్మెలో పాల్గొన్న వారిని తొలగిస్తామని 14వ తేదీన నోటీసులు జారీ చేయడంతో 290 మంది వరకు విధుల్లో చేరారు. మిగతా 260 మంది మాత్రం 15వ తేదీన కూడా సమ్మె కొనసాగించారు. కానీ, మూడేళ్ల లోపు సర్వీస్ ఉన్న గ్రామీణ డాక్ సేవక్‌లు ఆందోళనలు, సమ్మెలో పాల్గొనకూడదని నిబంధన ఉన్నా ఉల్లంఘించారంటూ విధుల నుంచి తొలగించారు. కాగా, ఉత్తరాల బట్వాడాతో పాటు పొదుపు ఖాతాలు, డిపాజిట్లు, వృద్ధాప్య పింఛన్లు, ఉపాధి హామీ పథకం కూలీల వేతనాలు అందించడంలో కీలకంగా వ్యవహరిస్తున్న వీరు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పనికి తగిన వేతనం చెల్లించాలనే డిమాండ్‌తో సమ్మె చేశారు. కానీ, ఇప్పుడు విధుల నుంచి తొలగిస్తూ ఈనెల 15వ తేదీనే ఉత్తర్వులు వెలువడినా, శుక్రవారం వెలుగుచూసింది. ఈ మేరకు ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకే..



మూడేళ్ల లోపు సర్వీస్ ఉండి సమ్మెలో పాల్గొన్న డాక్ సేవక్‌లను తొలగించాలన్న ఉన్నతాధికారుల ఆదేశాలను అమలు చేశాం. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 260 మందిని విధుల నుంచి తొలగించాం. ఎంపికైనప్పుడే నిబంధనలు పాటిస్తామని అంగీకరిస్తూ సంతకాలు చేశారు. కానీ, సమ్మెలో పాల్గొన్న డాక్ సేవక్‌లను దేశవ్యాప్తంగా తొలగించారు.

–కె.రవికుమార్, జిల్లా తపాలా శాఖ సూపరింటెండెంట్

నిర్ణీత గడువులోగా అనుమతులు

లేఔట్ అప్రూవ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ గౌతమ్



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన కేఎంసీ కమిషనర్ ఆదర్శ్, అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో లే ఔట్ల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి నిబంధనల మేరకు నిర్ణీత గడువులోగా అనుమతులు జారీ చేయాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా స్థాయి లే ఔట్ అప్రూవల్ కమిటీ సమావేశం జరగగా.. కేఎంసీ, వైరా, మధిర, సత్తుపల్లి మున్సిపాటీలు, సుడా పరిధిలో వచ్చిన23 దరఖాస్తులను పరిశీలించారు. ఇందులో నిబంధనల మేరకు ఉన్న దరఖాస్తులను ఆమోదించాక కలెక్టర్ గౌతమ్ మాట్లాడారు. దరఖాస్తులను రెవెన్యూ, విద్యుత్, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, టౌన్ ప్లానింగ్ తదితర శాఖల అధికారులు క్షేత్రస్థాయి పరిశీలించి అన్నీ సక్రమంగా ఉంటే 21రోజుల్లోగా అనుమతి జారీ చేయాలని తెలిపారు. ఆతర్వాత జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆమోదిస్తామని పేర్కొన్నారు. ఈసమావేశంలో కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, ఖమ్మం ఆర్డీఓ జి.గణేష్, జెడ్పీ సీఈఓ అప్పారావు, డీపీఓ హరికిషన్, పీఆర్ ఎస్ఈ చంద్రమౌళి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, డీటీసీఈపీఓ ప్రసాద్, టీపీఓ వికాస్, మున్సిపల్ కమిషనర్లు సుజాత, రమాదేవి, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశీయ వంగడాలతోనే మేలు

- విత్తనాలను కాపాడడమే లక్ష్యం
- 15 రకాల వరి సాగుచేసిన అభ్యుదయ రైతు రాణాప్రతాప్
- కోత దశకు చేరుకున్న పంట

నేడు జాతీయ రైతు దినోత్సవం


వల్లాపురంలో రాణాప్రతాప్ సాగు చేస్తున్న దేశీయ వరి వంగడాలు

వైరారూరల్: వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకం పెరగడంతో ఖర్చులు అధికమవుతున్నా అరకొర దిగుబడులే వస్తుండటంతో రైతులు నష్టపోతున్నారు. ఈ నేపథ్యాన వైరా మండలం వల్లాపురం గ్రామానికి చెందిన అభ్యుదయ రైతు తుమ్మల రాణాప్రతాప్ దేశీయ వరి వంగడాలను కాపాడటమే కాకుండా విత్తన బ్యాంకు ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. ఆయన ఈ ఏడాది అర ఎకరం భూమిలో 15 రకాల పురాతన వరి విత్తనాలు సాగు చేయగా, పంటలు కోత దశకు చేరాయి. కాగా, రాణాప్రతాప్ ఏటా వివిధ రకాల పంటల మార్పిడి, సేంద్రియ సేద్యం చేస్తూ రాష్ట్ర, జాతీయస్థాయిలో పలు అవార్డులు అందుకున్నారు. శనివారం జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా రాణాప్రతాప్ సాగు చేస్తున్న వంగడాలు, అవలంభిస్తున్న విధానాలపై కథనం.

దేశవాళీ విత్తనాలు, సేంద్రియ సేద్యం

వైరా మండలంలో ఈ ఖరీఫ్‌లో స్థానికంగా లభించే 1262, బీపీటీ, 1061 వంటి రకాలను రైతులు సాగుచేశారు. కానీ, 30 ఏళ్ల నుంచి వివిధ రకాల పంట మార్పిడితో వ్యవసాయం చేస్తున్న తుమ్మల రాణాప్రతాప్ ఈ ఏడాది ఖరీఫ్‌లో దేశవాళీ రకాల సాగే లక్ష్యంగా తమిళనాడు, కేరళ, మేఘాలయ, మణిపూర్, సిక్కిం రాష్ట్రాల నుంచి పురాతన రకాల వరి విత్తనాలు తెప్పించి తన అర ఎకరం భూమిలో సాగు చేశారు. నాలుగేళ్ల నుంచి ఆయన బ్లాక్ అండ్ రెడ్ రైస్ రకాలు సాగు చేయగా, ఈసారి వినూత్నంగా వివిధ ప్రాంతాల నుంచి తెప్పించిన రకాలైన రక్తశాళి, కుంకుమశాళి, మైసూర్‌మల్లిక, కుళాకార్, క్షేత్రీయ మహారాజ్, కృష్ణవిరిగి, కాలబట్టీ, నవారా, ఎస్–56, మణిపూర్‌బ్లాక్, బహురూపి, కుజీపటాలియా, చిట్టిముత్యాలు, ఇంద్రాణి రకాలను సాగు చేశాడు. అంతేకాక రసాయన ఎరువులకు బదులు ఆవు మూత్రం, ఆవు పేడ, జీవామృతం, గణజీవామృతంతో సేంద్రియ ఎరువులను స్వయంగా తయారు చేసి ఉపయోగించారు. ఫలితంగా తెగుళ్ల బారి నుంచి వరి పంటను కాపాడటమే కాక మంచి దిగుబడి సాధించారు.

110 నుంచి 150 రోజుల్లో దిగుబడి..

వివిధ ప్రాంతాల నుంచి తెప్పించి సాగు చేసిన 15 రకాల విత్తనాల సాగు కాల వ్యవధి సుమారు 110 నుంచి 150 రోజుల వరకు ఉండగా.. రూ.5 నుంచి రూ.10 వేల వరకు పెట్టుబడిగా వెచ్చించాడు. కానీ, ఆదాయం మాత్రం రూ.60 వేల నుంచి రూ.70 వేల వరకు రానుందని రాణాప్రతాప్ తెలిపారు. ఇప్పటికే పలు రకాల వరి కోయించి ధాన్యాన్ని కిలో రూ.150 చొప్పున విక్రయించినట్లు పేర్కొన్నారు. దేశవాళీ రకాలకు మార్కెట్‌లో డిమాండ్ ఉన్నందున మిగిలిన ధాన్యాన్ని బియ్యంగా మార్చి అమ్మనున్నట్లు తెలిపారు.

వచ్చే సీజన్‌లో 30 రకాలు..



దేశీయ వరి వంగడాలను కాపాడాలనే ఉద్దేశంతో ఈసారి 15 రకాల వరి సాగుచేశా. వచ్చే ఖరీఫ్‌లో 30 రకాలు సాగు చేయాలన్నది నా లక్ష్యం. అంతేకాకుండా భవిష్యత్‌లో విత్తన బ్యాంకు ఏర్పాటు చేసి రైతులకు విక్రయించాలని కార్యాచరణ రూపొందించా.

– తుమ్మల రాణాప్రతాప్, అభ్యుదయ రైతు, వల్లాపురం

సేంద్రియ వ్యవసాయమే ముద్దు


మిర్చి చేనులో పైపాటు చేస్తున్న కుడుముల వెంకట్రాంరెడ్డి

మధిర: ఎర్రుపాలెం మండలం మీనవోలు గ్రామానికి చెందిన కుడుముల వెంకటరామిరెడ్డికి మధిర మండలం సాయిపురం సమీపాన వ్యవసాయ క్షేత్రం ఉంది. ఎకరంలో పత్తి, నాలుగెకరాల్లో వరి, మరో ఎకరంలో, మిర్చి సాగు చేసినా ఆయన వరి, మిర్చిలో దేశవాళీ విత్తనాలే ఉపయోగించారు. అంతేకాక రసాయన ఎరువులకు బదులు పశువుల ఎరువులతో జీవ సంబంధమైన ఎరువులు తయారుచేసి పిచికారీ చేస్తున్నారు. జొన్నపిండి, బియ్యపుపిండి, బెల్లంతో కలిపి పురుగుల నివారణకు ఉపయోగించే మందును ఆయన ఖమ్మం, నల్లగొండ, మహబూబాబాద్, ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాల పరిధిలో అనేక మంది రైతులకు సరఫరా చేస్తుండడం విశేషం. అంతేకాక ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతపై పలు ప్రాంతాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. రైతు దుకాణానికి వెళ్లి విత్తనం, పురుగుమందులు, ఎరువులను కొనుగోలు చేయకుండా కేవలం పంట విక్రయానికి మాత్రమే మార్కెట్‌కు వెళ్లే రోజులు రావాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన చెబుతున్నారు. రూపాయి ఖర్చు లేకుండా వ్యవసాయం లేదా ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా భూములు సారవంతంగా ఉంటాయని.. ఈ పంటల ఉత్పత్తులు తినడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని తెలిపారు. కాగా, తెలంగాణ నూతన ప్రభుత్వంలో మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్కకు డిప్యూటీ సీఎంగా పదవి దక్కడం, మధిర నియోజకవర్గాన్ని ఆర్గానిక్ హబ్‌గా చేస్తానని ఆయన ప్రకటించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అలాగే, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేలా ప్రోత్సహిస్తే అందరికీ మేలు జరుగుతుందని తెలిపారు.

రేపు సకల ఉద్యోగ సంఘాల సమావేశం

ఖమ్మం సహకారనగర్: జిల్లా సకల ఉద్యోగ సంఘాల సమావేశాన్ని ఈనెల 24న నిర్వహిస్తున్నట్లు కొణిదెన శ్రీనివాస్, మోదుగు వేలాద్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 9గంటలకు మొదలయ్యే ఈ సమావేశానికి ఉద్యోగ, ఉపాధ్యాయ, గెజిటెడ్, నాన్ గెజిటెడ్, ఎల్ఐసీ, రైల్వే, ఆర్టీసీ, అంగన్‌వాడీ, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతోపాటు పెన్షనర్లు హాజరుకావాలని కోరారు. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులతోపాటు ప్రజాప్రతినిధులను ఈ సందర్భంగా సన్మానించనున్నట్లు వారు తెలిపారు.

కెమికల్స్ ఫ్యాక్టరీలో అధికారుల తనిఖీలు

935 కిలోల డ్రగ్స్ నిల్వలు సీజ్


కెమికల్ ఫ్యాక్టరీలో సీజ్ చేసిన డ్రగ్స్(మాత్రలు)తో అధికారులు

తల్లాడ: తల్లాడ మండలం అన్నారుగూడెంలోని ఓ కెమికల్స్ ఫ్యాక్టరీలో పోలీసులు, ఔషధ నియంత్రణ శాఖ అధికారులు శుక్రవారం దాడులు చేశారు. అన్నారుగూడెంలో చిన్న తరహా పరిశ్రమల స్థలంలో 12ఏళ్ల క్రితం కెమికల్ ఫ్యాక్టరీని స్థాపించారు. అప్పట్లోనే ఫ్యాక్టరీ వద్దని స్థానికులు నిరసన తెలపగా యాజమాన్యం కొంతకాలం మూసివేయగా, ఇటీవల నూతన యాజమాన్యం తీసుకుని వివిధ రకాల కెమికల్స్ తయారు చేస్తున్నట్లు చెబుతున్నారు. అయితే, ఫ్యాక్టరీలో డ్రగ్స్(మత్తు కోసం వినియోగించే మాత్రలు) తయారుచేస్తున్నారనే ఫిర్యాదులు అందడంతో వైరా ఏసీపీ రెహమాన్, సీఐ సాగర్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 28 బ్యాగుల్లో నిల్వ ఉంచిన 935కిలోల డ్రగ్స్(మాత్రలు)ను సీజ్ చేశారు. ఇంకా డ్రమ్ముల్లో పెద్ద మొత్తంలో డ్రగ్స్ ఉన్నట్లు గుర్తించి శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపిస్తున్నట్లు అధికారులు తెలిపారు. నివేదిక వచ్చాక పూర్తి వివరాలు తెలుస్తాయని పేర్కొన్నారు. కాగా, అనుమతి లేకుండానే ఫ్యాక్టరీ నడుపుతున్నట్లు గుర్తించిన అధికారులు.. యాజమాన్యంపై కేసు నమోదు చేయగా, సుమారు పది గంటల పాటు కొనసాగిన తనిఖీలు రాత్రి పది గంటలకు ముగిశాయి.

‘ఈస్తటిక్స్’ విజేతలు వీరే..

నేడు పురస్కారాల ప్రధానం

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం ఈస్తటిక్స్–2023 విజేతలకు శనివారం పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు సంస్థ ప్రతినిధి రవిమారుత్ తెలిపారు. ఈ పోటీలకు 100 కవితా సంపుటిలు, 140కి పైగా కథలు వచ్చాయని పేర్కొన్నారు. ఈమేరకు కవిత్వం విభాగంలో వసీరా సంపుటి సెల్ఫీ రూ.40 వేల బహుమతి గెలుచుకోగా, అనిల్ డ్యానీ కవితా సంపుటి గాంధారి వాన, లండ సాంబమూర్తి కవితా సంపుటి నాలుగు రెక్కల పిట్ట, అరుణ నారదభట్ల కవితా సంపుటి లోపలి ముసురు ప్రత్యేక ప్రశంసా అవార్డుకు ఎంపికయ్యాయని తెలిపారు. ఇక కథల విభాగంలో శ్రీఊహ రచించిన లడాయి రూ.25 వేల బహుమతి గెలుచుకోగా, స్వర్ణ కిలారి రచించిన ఆరో తనం, జి.ఉమా మహేశ్వరి రచించిన సంభావన ద్వితీయ, తృతీయ బహుమతికి ఎంపికయ్యాయని పేర్కొన్నారు. అలాగే,పెద్దింటి అశోక్‌కుమార్ కథ కలలు రాలుతున్న నేల, కుప్పిలి పద్మ కథ నా స్నేహితురాలు మణిపురి – ఝెక్స్’ బహుమతులు గెలుచుకున్నాయని తెలిపారు. ఈమేరకు శనివారం సాయంత్రం ఖమ్మంలోని హార్వెస్ట్ పాఠశాలలో నిర్వహించే సమావేశంలో పురస్కారాల ప్రధానోత్సవం చేస్తామని రవిమారుత్ వెల్లడించారు.

కదం తొక్కిన యువ‘జనం’



నృత్యం చేస్తున్న కళాకారులు


బాలికల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీవైఎస్ఓ టి.సునీల్‌రెడ్డి, తదితరులు


బాలుర విభాగంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న డీవైఎస్ఓ, తదితరులు

- యువజనోత్సవాల్లో సత్తా చాటిన కళాకారులు
- ఆటపాటలతో హోరెత్తిన భక్తరామదాసు కళాక్షేత్రం

ఖమ్మం స్పోర్ట్స్: గ్రామీణుల నోళ్లలో నానే పాటలు... పని సమయంలో ఉత్సాహాన్ని నింపే పాటలు... వీటికి తోడు తగిన నృత్యాలతో యువజనోత్సవం హోరెత్తింది. ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో శుక్రవారం జిల్లాస్థాయి యువజన ఉత్సవాలను జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా నలుమూలల నుంచి హాజరైన 700మందికి పైగా కళాకారులు తమ ఆటపాటలతో సత్తాచాటారు. జానపద గీతాలు, నృత్యాలు, వ్యాసరచన, వకృత్వం, ఫొటోగ్రఫీ పోటీలు జరగగా, ప్రారంభ సమావేశంలో డీవైఎస్ఓ టి.సునీల్‌రెడ్డి మాట్లాడారు. ఈకార్యక్రమంలో డీపీఆర్ఓ గౌస్, డాక్టర్స్ అకాడమీ చైర్మన్ రాయల సతీష్, యువజన సంఘాల బాధ్యులు జక్కుల వెంకటరమణ, ఉమ, శిక్షకులు ఎం.డీ.గౌస్, ఎం.డీ.అక్బర్ అలీ, పరిపూర్ణచారి, ఓలేటి సాంబమూర్తి, హరి పాల్గొన్నారు.

కళకళలాడిన కళాక్షేత్రం

జిల్లా స్థాయి యువజనోత్సవాల్లో భాగంగా భక్త రామదాసు కళాక్షేత్రం కళాకారులతో కళకళలాడింది. ఖమ్మం నగరం నుంచే వంద మందికి పైగా హాజరుకాగా, ఇతరచోట్ల నుంచి600 మంది కళాకారులు హాజరు కావడం విశేషం. ఈమేరకు జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామని నిర్వాహకులు తెలిపారు.

విజేతలు వీరే...

జిల్లా స్థాయి యువజనోత్సవాల విజేతల వివరాలను డీవైఎస్ఓ టి.సునీల్‌రెడ్డి ప్రకటించారు. ఫొటోగ్రఫీలో ఎస్.సోమశృతి(టీఎస్ఆర్‌జేసీ, వైరా), పి.అనుష్క(వైరా), వకృత్వ పోటీల్లో యు.వర్షిని(ఎస్సార్ అండ్ బీజీఎన్ఆర్), ఎం.సింధు (వైరా), హ్యాండ్ క్రాఫ్ట్‌లో జి.కుమారి(వైరా), శృతికీర్తి(ఖమ్మం) మొదటి రెండు స్థానాల్లో, వ్యాసరచన పోటీల్లో ఎస్.కే.ఫైజుద్దీన్(నేలకొండపల్లి), ఎం.సత్య(సత్తుపల్లి), ఎం.డీ.సమీర్(నేలకొండపల్లి) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. బృంద నృత్యంలో టీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ, టేకులపల్లి, టీఎస్ఆర్‌జేసీ, వైరా మొదటి రెండు స్థానాలు దక్కించుకోగా, సోలో డ్యాన్స్‌లో ఎస్.మార్తమ్మ(టీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ, వైరా), జి.శ్రీనిధి(టీఎస్‌డబ్ల్యూఆర్‌జేసీ, టేకులపల్లి), ఎం.అఖిల(ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఖమ్మం), జానపద పాటలు(గ్రూప్‌లో గంగాధర్(ఖమ్మం), టి.సింధుజ(జీజేసీ, వైరా), లక్ష్మీసౌందర్య(టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, వైరా) మొదటి మూడుస్థానాల్లో దక్కించుకున్నారు.

ఎంపీల సస్పెన్షన్ దారుణం

- మోదీని గద్దె దించితేనే ప్రజాస్వామ్యానికి రక్షణ
- నిరసనలో ‘ఇండియా’ కూటమి పార్టీల నాయకులు


నిరసనలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు

ఖమ్మంవన్‌టౌన్: కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీని గద్దె దించితేనే దేశంలో ప్రజాస్వామ్యానికి రక్షణ లభిస్తుందని వివిధ పార్టీల నాయకులు పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా పార్లమెంట్ నుంచి 146మంది ఎంపీలను సస్పెండ్ చేయడం గర్హనీయమన్నారు. ఎంపీల సస్పెన్షన్‌ను నిరసిస్తూ ‘ఇండియా’ కూటమిలో భాగస్వాములైన పార్టీల నాయకులు శుక్రవారం ఖమ్మంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలతో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు భాగం హేమంతరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ప్రజాపంథా జిల్లా నాయకుడు గోకినపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడారు. బీజేపీ అవలంభిస్తున్నవన్నీఅప్రజాస్వామిక విధానాలేనని, ప్రజాస్వామ్య మనుగడ కోసం మోదీని గద్దె దింపాల్సిందేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు నల్లమోతు తిరుమలరావు, రాయల నాగేశ్వరరావు, నల్లమల వెంకటేశ్వరరావు, మిక్కిలినేని మంజుల, నరేందర్, వక్కలగడ్డ సోమచంద్రశేఖర్, కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య, మొక్కా శేఖర్‌గౌడ్, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, బొడ్డు బొందయ్య, చావా నారాయణరావు, దొడ్డా నగేష్, రావూరి సైదుబాబు, పల్లెబోయిన భారతీచంద్రం, బాణాల లక్ష్మణ్, నరాల నరేష్, రజి, కళ్యాణం వెంకటేశ్వరరావు, పోటు ప్రసాద్, ఆవుల అశోక్, యర్రా శ్రీకాంత్, మీరా, మంగతాయారు, స్వర్ణ సుబ్బారావు, గంధం పుల్లయ్య, ఆజాద్ పాల్గొన్నారు.

రెండు రోజుల పాటు ‘క్రెడాయ్’ ఎక్స్‌పో



మాట్లాడుతున్న క్రెడాయ్ అధ్యక్షుడు జయకిషోర్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలో ఈనెల 24, 25వ తేదీల్లో నిర్వహిస్తున్న ప్రాపర్టీ ఎక్స్‌పోను విజయవంతం చేయాలని క్రెడాయ్ అధ్యక్షుడు బండి జయకిషోర్ కోరారు. ఖమ్మంలోని ఎస్ఆర్‌అండ్ బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ కళాశాల మైదానంలో రెండు రోజుల పాటు క్రెడాయ్ ఆధ్వర్యాన నిర్వహించే ప్రాపర్టీ ఎక్స్‌పోను ఆదివారం రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభిస్తారని తెలిపారు. ఈ ఎక్స్‌పోలో ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు తెలంగాణ వ్యాప్తంగా విస్తరించి ఉన్న ప్రముఖ రియల్ ఎస్టేట్, భవన నిర్మాణ సంస్థలు, అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీ, ఇండిపెండెంట్ నిర్మాణ రంగాల సంబంధిత సంస్థల బాధ్యులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఖమ్మంలో వరుసగా రెండోసారి ఎక్స్‌పోను నిర్వహిస్తున్న నేపథ్యాన ఉమ్మడి ఖమ్మం జిల్లా వాసులు సద్వినియోగం చేసుకోవాలని, గంటగంటకు ప్రత్యేక లక్కీ డ్రా తీస్తామని జయకిషోర్ తెలిపారు. ఈ సమావేశంలో క్రెడాయ్ ప్రధాన కార్యదర్శి పెద్ది కేశవరావు, కోశాధికారి చెరుకుమల్లి వెంకటేశ్వరరావు, గౌరవ అధ్యక్షులు వేజెండ్ల సురేష్, కొప్పు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మిర్చి పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు


మిర్చి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

వైరారూరల్: మండలంలోని రెబ్బవరం, గొల్లపూడి తదితర గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న మిర్చి పంటలను శుక్రవారం వ్యవసాయశాఖ అధికారులతో కలిసి కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు పరిశీలించారు. పూత, కాయ దశకు చేరిన మిరపలో కాయకుళ్లు, నల్లతామర ఆశించినట్లు గుర్తించగా, నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కాయకుళ్లు నివారణకు కాప్టాన్ 1.5 గ్రాములు లేదా డైపెన్‌కోనజోల్ మందు 0.5 మి.లీ.ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే, నల్ల తామర పురుగు నివారణకు బెవేరియా బ్యాసియానో 5 గ్రాములను లీటర్ నీటిలో కలిపి పిచిరీచేయాలని తెలిపారు. కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ కె.రవికుమార్, జెస్సీ సునీత, ఫణిశ్రీ, ఏడీఏలు బాబురావు, ఏఓ ఎస్.పవన్‌కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కోళ్ల వ్యర్థాలకు రూ.1.55కోట్లు !

- వేలంలో దక్కించుకున్న హైదరాబాద్ వాసి

ఖమ్మంమయూరిసెంటర్: చికెన్ సెంటర్ల నుంచి వెలువడే వ్యర్థాల సేకరణ బాధ్యతలు అప్పగించేందుకు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు వేలం పాట నిర్వహించారు. కార్పొరేషన్ పరిధిలోని చికెన్ షాపుల నుండి వ్యర్థాలను సేకరించేందుకు నిర్వహించిన వేలంలో వివిధ ప్రాంతాలకు చెందిన ఆరుగురు పాల్గొన్నారు. ఈమేరకు హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి అత్యధికంగా రూ.1,55,66,000 కోట్ చేసి వ్యర్థాల సేకరణను దక్కించుకున్నాడని అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు చికెన్ షాపుల నిర్వాహకులే వ్యర్థాలను ఇతరులకు అప్పగించేవారు. ఇక నుంచి కేఎంసీ ఆధ్వర్యాన సేకరించనుండగా, వేలంతో భారీగా ఆదాయం సమకూరినట్లయింది.

డీఎస్ఆర్‌సీ కౌన్సిలర్‌గా సీతారామలక్ష్మి

ఖమ్మం వైద్యవిభాగం: గత కొన్నేళ్లుగా జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న డీఎస్ఆర్‌సీ కౌన్సిలర్ స్థానాన్ని వైద్యాధికారులు భర్తీ చేశారు. ఈమేరకు కౌన్సిలర్‌గా సీతారామలక్ష్మిని నియమించగా శుక్రవారం ఆమె విధుల్లో చేరారు. గత పదిహేనేళ్లుగా ఇదే ఆస్పత్రిలో ప్రివెన్షన్ ఆఫ్ పేరెంట్ టు చైల్డ్ ట్రాన్స్‌మిషన్(పీపీటీసీటీ)కౌన్సిలర్‌గా కొనసాగుతున్న ఆమెను ఈ పోస్టులో డిప్యూటేషన్‌పై నియమించారు. గత నెలలో సీతారామలక్ష్మిపై ఉద్యోగ నిర్వహణలో లోపాలు ఉన్నాయని చెబుతూ గత సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు ఆమెను తెలంగాణ సాక్స్ ప్రాజెక్టు డైరెక్టర్‌కు సరెండర్ చేశారు. విచారణ అనంతరం డీఎస్ఆర్‌సీ కౌన్సిలర్‌గా బాధ్యతలు అప్పగించారు.

ప్రత్యేక కార్యాచరణతోనే ఉత్తీర్ణత పెంపు

ఖమ్మంఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలని డీఈఓ సోమశేఖరశర్మ సూచించారు. ఖమ్మంలోని రిక్కాబజార్ బాలికల పాఠశాలలో శుక్రవారం ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం, కామేపల్లి మండలాల ఉన్నత పాఠశాలల హెచ్ఎంల సమావేశం జరిగింది. ఈసందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్ట్‌ల వారీగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేశామని తెలిపారు. ఈమేరకు త్వరగా సిలబస్ పూర్తిచేసి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ వహించాలని చెప్పారు. ఈసమావేశంలో డీసీఈబీ కార్యదర్శి ఖమ్మం అర్బన్ ఎంఈఓ ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆగి ఉన్న బైక్‌ను ఢీకొట్టిన కారు

కారేపల్లి: అదుపు తప్పిన కారు ఆగి ఉన్న బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. మండలంలోని ఉసిరికాయలపల్లికి చెందిన బానోతు తులసీరాం తన కుటుంబ సభ్యులతో కారులో శుక్రవారం ఖమ్మం నుంచి స్వగ్రామానికి వస్తున్నారు. ఈక్రమాన అప్పాయిగూడెం సమీపంలో ఎదురుగా కుక్క అడ్డురావడంతో దాన్ని తప్పించే క్రమాన అదుపు తప్పి రోడ్డుపక్కన ఆగిన బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో కారు, ద్విచక్రవాహనం నుజ్జునుజ్జు కాగా కారు బోల్తా పడింది. అయితే, ప్రమాదం నుంచి తులసీరాం, ఆయన భార్య కవిత, కుమారుడు స్వల్పగాయాలతో బయటపడడంతో ఊపిరిపీల్చుకున్నారు.

రైలు ఢీకొని యువకుడు మృతి


ఏసోబురెడ్డి (ఫైల్)

మధిర: మధిర రైల్వేస్టేషన్ సమీపాన గురువారం రాత్రి రైలు ఢీకొన్న ఘటనలో ఒక యువకుడు మృతి చెందాడు. మధిర మండలం నిధానపురానికి చెందిన గుర్రాల ఏసోబురెడ్డి(23) పాత రైల్వే గేట్ సమీపం నుంచి రైల్వేస్టేషన్ వైపునకు ట్రాక్ పక్కన నడిచి వెళ్తున్నాడు. అదే సమయాన వచ్చిన తమిళనాడు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు తాకడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడిలో తాళం వేసి ఉన్న ఇంట్లోకి పట్టపగలే చొరబడిన దొంగలు నగదు, ఆభరణాలు ఎత్తుకెళ్లారు. చిమ్మపుడికి చెందిన చింతల రామారావు గురువారం ఉద్యోగానికి వెళ్లగా, ఆయన కుటుంబీకులు కూడా తాళంవేసి బయటకు వెళ్లారు. ఈ విషయాన్ని గమనించిన దొంగలు తాళం పగులగొట్టి బీరువాలోని రూ.18 వేల నగదు, రెండున్నర తులాల బంగారం ఆభరణాలు చోరీ చేశారు. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో శుక్రవారం కేసు నమోదు చేసినట్లు రఘునాథపాలెం సీఐ శ్రీధర్ తెలిపారు.

వంతెన కింద యాచకుడి మృతదేహం

వైరారూరల్: కుళ్లిపోయిన స్థితికి చేరిన ఓ యాచకుడి(49) మృతదేహాన్ని శుక్రవారం గుర్తించారు. మండలంలోని స్టేజీ పినపాక సమీపాన హైలెవల్ వంతెన కింద ఈ మృతదేహాన్ని గుర్తించగా, వాహనదారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సదరు వ్యక్తి మృతదేహం ఒక పల్లెం, పిండి వంటలు ఉన్నాయి. మధిర ప్రభుత్వాస్పత్రి వైద్యులు చేరుకుని శవపరీక్ష నిర్వహించగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.